జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.


epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 5-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 90 పేజీలు: 8 వెల : రూ.7



# గొట్టా.. బాగుపడేదెట్టా?

❖ మరమ్మత్తులకు నోచుకోని బ్యారేజి ❖ పేరుకు పోయిన మట్టి, తగ్గిన నీటినిల్వ సామర్ధ్యం ❖ కేంద్ర బృందం సైతం జారీ చేసిన హెచ్చరికలు ❖ పరిశీలనలకే పరిమితమవుతున్న ఉన్నతాధికారులు ❖ నిధులు మంజూరులో ప్రభుత్వం నిర్లక్ష్యం

**హిరమండలం, ఆగస్టు 4 (వార్త):** జిల్లాను సస్యశ్యామలం చేస్తున్న అపర భగీరథి.. గొట్టాబ్యారేజి. సుమారు రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తోంది. ఇలాంటి ప్రాజెక్టును ప్రభుత్వం నిర్లక్ష్యంగా చూడడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇరిగేషన్ ఉన్నతాధికారులు బ్యారేజీని పరిశీలించి వెళ్లిపోతున్నారు తప్ప పట్టించుకున్న దాఖలాలు లేవు. వంశధార అధికారులు నిధుల విషయమై ప్రభుత్వం దృష్టికి నివేదికను తీసుకువెళ్లినా దాన్ని ఉన్నతాధికారులు పక్కన పడేస్తున్నారు. గొట్టాబ్యారేజికు ఎగువ భాగాన మట్టి పేరుకు పోవటంతో నీటి నిల్వల సామర్ధ్యం తగ్గుతుంది. ప్రధాన తలుపులు లీకులుమయంగా మారాయి. బ్యారేజి వెలుపుల నీటి ప్రవాహ గమనాన్ని మార్చేందుకు ఏర్పాటు చేసిన రాతి పేర్పు శిథిలమైంది. ఇన్ని సమస్యల నడుమ సగం ఆయకట్టుకు కూడా సాగు నీరందని దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితిని చూసి రైతులు ఆందోళన చెందు తున్నారు. 1971లో వంశధార నదిపై హిరమండలం వద్ద గొట్టాబ్యారేజి నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. తొలుత భామిని మండలం సింగిడి వద్ద జలాశయం నిర్మాణానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ ఒడిశా నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావటంతో హిరమండలం మండలం గొట్టాబ్యారేజి నిర్మాణానికి ఆంధ్ర సర్కారు పూనుకుంది. 1971లో బ్యారేజి నిర్మాణ పనులు ప్రారంభించి 1977 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేశారు. ప్రముఖ జలవనరులశాఖ ఇంజనీర్ సిఎం ఆర్ పట్నా యిక్ బ్యారేజి నిర్మాణానికి రూపకల్పన చేశారు. దాదాపు 20 మండలాల పరిధిలోని రెండు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరందించే వీలుగా కుడి, ఎడమ ప్రధాన కాలువలను ఏర్పాటు చేశారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా హిరమండలం, జలుమూరు, సారవకోట, నరసన్నపేట, పోలాకి, టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, మెళియాపుట్టి, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు 104 కిలోమీటర్ల పరిధిలో 12 మండలాల్లోని 398 గ్రామాల పరిధిలో 1,48,230 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరందిస్తోంది. అలాగే కుడి ప్రధాన కాలువ కూడా శివారు ప్రాంతాల ఆయకట్టుకు సాగుకు నీరందించలేని స్థితిలో ఉంది. ఈ కాలువ ద్వారా హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, శ్రీకాకుళం, గార మండలాలకు సాగు నీరు అందిస్తోంది. సుమారు 53 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న కాలువ సుమారు 70 వేల ఎకరాలకు నీరందిస్తోంది. ఇటీవల రాష్ట్ర రెవెన్యూ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిధులు కేటాయించడంతో కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు. దీంతో శివారుకు కొంతమేర నీరు సరఫరా అవుతోంది.

### శిథిలమైన రాతిపేర్పు..

గొట్టాబ్యారేజి దిగువన రాక్ ఫిల్ (రాతి పేర్పుడు)చేయాల్సి ఉంది. గత ఏడాది సంభవించిన మూడు వరదలకు రాళ్లు నదిలోకి కొట్టుకుపోయాయి. దీంతో గొట్టాబ్యారేజికి జడ్డి స్టోన్స్ దెబ్బతినే అవకాశం ఉంది. జడ్డి స్టోన్స్ పొరపాటున దెబ్బతిన్నట్లయితే గొట్టా బ్యారేజికి ముప్పు ఏర్పడనుంది. దీనికితోడు గట్లు కూడా పలుచోట్ల బలహీనంగా మారాయి. దీంతో వరద వచ్చే సమయంలో గండ్లు పడుతున్నాయి. అధికారులు, పాలకులు ముందుస్తు చర్యలు చేపట్ట కుంటే గొట్టాబ్యారేజికు ముప్పు వాటిల్లకు తప్పదని రైతులు అంటున్నారు.

# కొబ్బరి రైతు.. కుదేలు



❖ తిత్లీ తరువాత మెరుగుపడని కొబ్బరి వ్యాపారం
❖ ఉపాధి లేక వేలాది కుటుంబాలు పస్తులు
❖ గిట్టుబాటు ధర కల్పించని ప్రభుత్వం

**శ్రీకాకుళం, ఆగస్టు 4 (వార్త):** ఉద్దానం అంటేనే కొబ్బరికి ప్రసిద్ధి. అలాంటిది ప్రతి ఏడాది వరుస తుపాన్లతో కొబ్బరి చెట్లు నేల కూలాయి. తిత్లీ, హుద్‌హుద్ తుపాన్లు కొబ్బరి రైతులను నష్టాలపాల్జేసింది. దీంతో వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పి స్తున్న కొబ్బరి మార్కెట్ కుదేలవుతోంది. ప్రత్యక్షంగా, పరో క్షంగా ఆధారపడిన కార్మికులు, కూలీలు, ఇతర సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. సరకు అందుబాటులో లేకపోవ డంతో వ్యాపారులు పూర్తిస్థాయిలో లావాదేవీలు నిర్వహించ లేని దుస్థితి నెలకొంది. ప్రస్తుతానికి వస్తున్న దిగుబడుల్లో మూడొంతులు ఒడిశాకు తరలిపోతుండటంతో ఉద్దానం కొబ్బరి మార్కెట్ ఉనికి కోల్పోయే ప్రమాదం ఉంది. తిత్లీ తుపానుకు ముందు కంచిలి కొబ్బరి మార్కెట్‌లో ఏ బడ్డీ చూసినా వేలాది బొండాలతో దర్శనమిచ్చేవి. ఒక్కో బడ్డీ దగ్గర కనీసం 30 మంది కార్మికులు పని చేస్తూ ఉపాధి పొందే వారు. కాయల లోడింగ్, అన్ లోడింగ్, ఇతర పనులకు 20 మంది కి పైగా రోజువారీ కూలీలు, పరోక్షంగా మరో 100 మందికి ఉపాధి అవకాశాలు ఉండేవి. రైతులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీ సిబ్బంది, వ్యాపారులతో ప్రతి బడ్డీ రద్దీగా ఉండేది. పండగల సమయంలో ఉత్తరాది రాష్ట్రాలకు సరకు ఎగుమతి కోసం లావాదేవీ లు జోరుగా సాగేవి. ప్రస్తుతం కంచిలి మార్కెట్ లో దాదాపుగా లావాదేవీలు నిలిచిపోయాయి. ఏ బడ్డీ చూసి నా ఒకరిద్దరు తప్పిస్తే కార్మికులు, కూలీలు, ఇతరుల జాడ కనిపించడం లేదు. నిల్వ చేయడానికి కొబ్బరికాయలు దొరక డం లేదు. రోజువారీ కూలీలకు ఉపాధి అవకాశాలు కరవయ్యాయి. అధికంగా డిమాండ్ ఉన్న కవిటి ఉద్దానం కొబ్బరి కాయలు ఒడిశా మార్కెట్‌కు వెళ్తుండటంతో కంచిలి మార్కెట్‌కు సరకు అందించే పరిస్థితి లేకుండా పోయింది. తిత్లీ తుపాను తరువాత కవిటి ఉద్దానంలో దిగుబడుల పరి స్థితి కొంతమేర మెరుగుపడినప్పటికీ ధర, ఇతర అంశాల పరంగా ఇబ్బందులు నెలకొన్నాయి. ఒడిశా వ్యాపారులు కవిటి ఉద్దానం తోటలకు వెళ్లి సరకు సేకరిస్తుండటం, కంచిలి వ్యాపారుల కంటే రూ.2 వరకు ఎక్కువ ధర చెల్లిస్తుండటంతో రైతులు పొరుగు రాష్ట్రం వ్యాపారులతో లావాదేవీలు సాగిస్తున్నారు. కవిటి ఉద్దానంలో 30 వేల ఎకరాలకు పైగా కొబ్బరి తోటలుండగా చీడపీడలు, ఇతర ఇబ్బందుల నేపథ్యంలో దిగుబడులు తగ్గాయి. సాధార ణంగా ఎకరా తోట నుంచి గతంలో 800 కొబ్బరికాయలు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం సగటున 400 కాయలు రావడం లేదు. పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో 12 వేల ఎకరాల మేర కొబ్బరి తోటలు ఉన్నాయి. తిత్లీ తుపాను సమయంలో చాలావరకు నేలమట్టమయ్యాయి. ఇప్పట్లో దిగు బడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. వ్యాపారులు ఏకపక్షంగా నిర్ణయించే ధరల కారణంగా సమస్యలు ఉత్పన్నమవుతు న్నాయి. వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న కొబ్బరి పంట గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు.






## ట్రిపుల్ ఐటీలో...
# అన్ని వసతులు కల్పిస్తాం

* కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు * కేంద్రమంత్రికి సమస్యలు విన్నవించిన శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్

**శ్రీకాకుళం, ఆగస్టు 4 (వార్త):** ఆర్జీయూకేటీ (ట్రిపుల్ ఐటీ) శ్రీకాకుళం క్యాంపస్‌లో ఆరు బ్యాచ్‌ల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు హామీ ఇచ్చారు. ఆదివారం శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ కేంద్ర మంత్రిని కలిసి సమస్యలు వివరించారు. ట్రిపుల్ ఐటీలో ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో పీయూసీ రెండేళ్లు, ఇంజినీరింగ్ నాలుగేళ్లు ఉన్నాయన్నారు. పీయూసీ ఇంజినీరింగ్ చెరో రెండు బ్యాచ్‌లకు మాత్రమే తరగతులు జరుగుతున్నాయని తెలిపారు. మిగిలిన ఇంజినీరింగ్-3, 4 బ్యాచ్‌లకు నూజివీడులో తరగతులు నిర్వహిస్తున్నారని చెప్పారు. మంత్రి స్పందిస్తూ నిర్మాణంలో ఉన్న భవనాలను యుద్ధప్రాతిపదికన అందుబాటులోకి అక్కడి విద్యార్థులను తీసుకురావాలని సూచించారు. పూర్తిస్థాయిలో వసతులు కల్పించి నాణ్యమైన సాంకేతిక విద్య అందించడానికి కృషి చేస్తామన్నారు.




ప్రయాణికునికి చేరని ఆర్టీసీ 3లో



## బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 4 (వార్త):** బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని టౌన్ ఎస్ఐ వెన్ను సత్యనారాయణ అన్నారు. ఆదివారం పబ్లిక్ ప్రాంతాల్లో మద్యం సేవించే వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సాధారణ ప్రజలకి అసౌకర్యం కలగకుండా చూడాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే శిక్షలు తప్పవని హెచ్చరించారు.

# ఎస్సీ వర్గీకరణ సాహసోపేత నిర్ణయం

### X పార్టీలో కష్టపడేవారికి సముచిత స్థానం X బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు



**పలాస, ఆగస్టు 4 (వార్త):** ఎస్సీ వర్గీకరణ సాహసోపేతమైన నిర్ణయమని బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. భారతీయ జనతాపార్టీ పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ అధ్యక్షుడు వైశ్యరాజు మోహన్ రాజు అధ్యక్షతన గణపతి రెసిడెన్సీ కళ్యాణ మండపంలో కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకుముందు నెహ్రూ పార్క్‌లో మొక్కలు నాటారు. కార్యకర్తలు సమావేశంలో బిర్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ క్రమశిక్షణ ఉన్న పార్టీ అని తెలిపారు. పార్టీ కోసం శ్రమిస్తున్న వారికి అధిష్టానం మంచి గుర్తింపు ఇస్తుందన్నారు. 2024-25లో ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మన రాష్ట్రానికి పెద్దపీట వేసిందన్నారు. కార్యకర్తలు, నేతలు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంఠ రావు, సీనియర్ నాయకులు పైల రాజ రత్నం నాయుడు, నియోజకవర్గం కో కన్వీనర్ చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ, టౌన్ ప్రధాన కార్యదర్శులు హనుమంతు రామారావు, గొంటి అప్పారావు, కె పి రామన్న, కర్రి ప్రసాద రావు, పి వి శ్రీనివాస రావు, లక్కోజు ధర్మారావు, పి తారకేశ్వర రావు, కిక్కర ప్రకాశ రావు, బూర్జ పేట హరికృష్ణ, కంచరాన పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

**పలాస, ఆగస్టు 4(వార్త):** మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని పలాస లయన్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. ఆదివారం పలాస కాశీబుగ్గ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ జిల్లా గవర్నర్ లైన్ ప్రూఫ్ వివిఎస్ స్ ప్రసాద్ ఇచ్చిన పిలుపు మేరకు వజ్రపుకొత్తూరు మండలం బెండి ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న వంటషెడ్‌పై రేకులను వేసి అందజేశారు. పాఠశాల పిల్లలందరికి రెండేసి నోటుబుక్స్, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అవసరమైన ఆర్థికసాయాన్ని డోకి రామారావు అందజేశారు. కార్యక్రమంలో ఫస్ట్ వైస్ గవర్నర్ డి. సూరప్రకాష్, రీజియన్ చైర్మన్ ఊన్న రంగనాథ్, పలాస కాశీబుగ్గ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు హెచ్ వై దొర, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, కోశాధికారి నెమలిపురి అప్పారావు, వి.వెంకటరావు, డాక్టర్ టీ. కృష్ణ మూర్తి, పివి సతీష్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలుగునాడులో చేరిన విద్యుత్ ఉద్యోగులు



**శ్రీకాకుళం, ఆగస్టు 4 (వార్త):** నగరంలోని శాంతినగర్ కాలనీలోని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ స్వగృహంలో వైయస్సార్ విద్యుత్ ట్రేడ్ యూనియన్‌కు చెందిన 20 మంది విద్యుత్ ఉద్యోగులు తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘంలో ఆదివారం చేరారు. ఎమ్మెల్యే కూన రవి కుమార్ వారికి కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘానికి తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘాన్ని మరింతగా బలోపేతం చేయాలని, తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. తెలుగునాడులో చేరిన వారిలో ఆమదాలవలస లైన్ ఇన్స్పెక్టర్ కాకర్ల శ్రీనివాసరావు, సనపల రామారావు, లైన్‌మెన్ తామాడ అప్పన్న, గొద్దు గోపి, రెడ్డి వాసుదేవరావు ఉన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం రీజినల్ అధ్యక్షుడు జి.వి రమణమూర్తి, కార్యదర్శి వైకుంఠరావు, తదితర జిల్లా కార్యవర్గ నాయకులు పాల్గొన్నారు.



## సహారా బాధితులను ఆదుకోండి

**సోంపేట, ఆగస్టు 4 (వార్త):** సహారా కంపెనీలో డిపాజిట్లు పెట్టి ఏళ్ళు గడస్తున్నా ఖాతాదారులకు ఇబ్బందులకు గురిచేస్తున్న కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని, సహారా కస్టమర్స్, ఫీల్డ్ వర్కర్స్ యూనియన్ ఇచ్ఛాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ దాసరి రాజును కలిసి కోరారు. శ్రీకాకుళం రీజన్‌లో 500 కోట్ల రూపాయలు సహారా సంస్థ ద్వారా చెల్లింపులు చేయాల్సి ఉందన్నారు. సిఆర్సీఎస్ అనే పోర్టల్ ద్వారా ప్రతి ఖాతాదారుడికి సొమ్ము జమ చేస్తామని అప్పటి, ప్రస్తుత కేంద్ర మంత్రి అమిత్ షా 2023 లో హామీ ఇచ్చారన్నారు. ఇంతవరకు ఐదు శాతం కూడా చెల్లింపులు జరగలేదని, దీనివలన సహారా కస్టమర్లు, ఏజెంట్లు బలి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం అధ్యక్షుడు బైపల్లి సత్యరాజ్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు కాశీ విశ్వనాథం, మాధవరావు, రూప్ సుందర్ రావు, జ్యూజిస్ట్ పండ తదితరులు పాల్గొన్నారు.


## విద్యాలయం అభివృద్ధిలో మేము సైతం

**మందస, ఆగస్టు 4 (వార్త):** చదువుకున్న విద్యాలయానికి తమవంతు సాయం చేస్తామంటూ ముందుకు వస్తున్నారు పూర్వపు విద్యార్థులు. మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు భాగం పునఃనిర్మాణం జరుగుతోంది. దాతల ఆర్థిక సాయంతో జరగుతున్న ఈ నిర్మాణానికి పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది తాము కూడా సాయం చేస్తామంటూ రూ.60వేలును అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు జె.రవికుమార్, ఇన్చార్జి హెచ్ఎం రామచంద్రపాణిగ్రాహి, సురేష్చంద్రపండా, సిబ్బంది చేతుల మీదుగా డాక్టర్ పట్నాల మోహనరావుఆచారికి అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి శిస్టు సోమనాథ్, కోదండరావు పాల్గొన్నారు.



## రక్తదాతలు.. ప్రాణదాతలు

**కొత్తూరు, ఆగస్టు 4 (వార్త):** శ్రీ భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గోగుల రామారావు నాయుడు కాంప్లెక్స్ ఆవరణలో జేమ్స్ రాగోలు సౌజన్యంతో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా బామిడి రాజు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వందలాది మందికి పునర్జన్మను ఇచ్చేలా యువకులు భారీగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఆగతముడి అప్పలనాయడు మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నేటి యువత నిలవాలని సూచించారు. రక్తం ఎంతో విలువైనదని, డబ్బుతో కొనగలిగేది కాదని తెలిపారు. ఆరోగ్య వంతులైన ప్రతి ఒక్కరూ రక్తదాతలు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆపదలో ఉన్న వారు రక్తం దొరకక ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకొంటున్నారన్నారు. ఇబ్బందులకు గురవుతుంటారని అటు వంటి వారికి రక్తదానం చేయడం వల్ల వారి ప్రాణాలు కాపాడిన వారమవుతామని తెలిపారు. కార్లేమ్మ గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎద్దు గోపాల్ దాస్ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఆరు నెలలకు ఒక్కసారి అయినా రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో మొత్తంగా 104 యూనిట్ల రక్తాన్ని ట్రస్ట్ సభ్యులు రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో జేమ్స్ ఆసుపత్రి సిబ్బంది, శ్రీ భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.





## ఘనంగా ప్రపంచ స్నేహితుల దినోత్సవం

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 4 (వార్త):** ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని శ్రీకాకుళంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం పట్టణంలో మీనా కృష్ణ ప్లాజాలో 1983-93 మధ్య కాలంలో హిరమండలంలో జీజే కాలేజ్‌లో చదివిన పూర్వ విద్యార్థులు 5వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్టాలకి చెందిన 50 మంది పూర్వ విద్యార్థులు కుటుంబాలతో హాజయ్యారు. తమతో చదివి దివంగుతులైన 9 మంది మిత్రులకు నివాళులు అర్పించారు. 31 ఏళ్ల తమ అనుబంధం ఇకపై కూడా కొనసాగుతుందని నిర్వాహకుడు వారణాసి రాజారెడ్డి తెలిపారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పాలవలసలో ఐదుగురిపై పిచ్చికుక్క దాడి

**సోంపేట, ఆగస్టు 4 (వార్త):** పాలవలస గ్రామంలో పిచ్చికుక్క ఐదుగురు వ్యక్తులపై దాడి చేసి గాయపరిచింది. వీరిలో సంగారు బూదమ్మపై విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆమెను గ్రామ సర్పంచ్ హేమలత సోంపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఆమెకు డాక్టర్ వెంకటేష్ చికిత్స అందించారు. ఈ దాడుల్లో గాయపడిన మరో నలుగురిని కొర్లాం ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు.




### ప్రయాణికునికి..

# చేరని ఆర్టీసీ

- ❖ కేవలం హైవేలకే సర్వీసులు ❖ నష్టాల పేరిట పలు సర్వీసులు రద్దు
- ❖ జిల్లా సరిహద్దు ప్రాంతాలకు పాసింజర్ సర్వీసులే ❖ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లేక ప్రయాణికుల ఇబ్బందులు ❖ పదుల సంఖ్యలో హైదరాబాద్‌కు ప్రైవేట్ సర్వీసులు ❖ హైదరాబాద్‌కు సర్వీసు నడపని ఆర్టీసీ అధికారులు
- ❖ ఆర్టీసీ జిల్లా అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

**శ్రీకాకుళం, ఆగస్టు 4(వార్త):** ప్రయాణికులందరికీ సౌకర్యం కల్పిస్తు ఆర్టీసీ బస్సులు నడపడంలో అధికారులు వైఫల్యం చెందుతున్నారు. ఉన్న బస్సులు ఒకే రూట్లో నడుపుతు నష్టాలు వస్తున్నాయంటు చేతులెత్తేస్తున్నారు. ఒకసారి తప్పు జరిగితే రెండోసారైనా జాగ్రత్త పడతాం. కాని ఆర్టీసీ వ్యవస్థ ఏర్పడి దశాబ్దాలు గడచిన అధికార యంత్రాంగం అటు ప్రయాణికులకు, ఇటు ఆర్టీసీ సంస్థకు లాభాపేతంగా చర్యలకు ఉపక్రమించడం లేదు. అన్నిరూట్లో ఆదాయం వస్తుందని ఎవరూ చెప్పలేరు. అయినా గతంలో నడిపిన రూటుకే పరిమిత మవుతున్నారే తప్ప కొత్తగా రోడ్లు నిర్మాణం, వెడల్పు చేయడాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవడం లేదు. విద్యార్థులు, ప్రయాణికులు ఆటోలపై ప్రయాణానికి అలవాటు పడుతూ తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాలు జరిగే సమయంలో అటుపాలకులు ఇటు ఆర్టీసీ సంస్థ అధికారులు హామీలివ్వడమే మిగులుతుంది. ఆర్టీసీ నడిపే రూట్లలో ప్రైవేటు బస్సుల పెత్తనం పెరుగుతుందే తప్ప కొత్త రూట్లలో బస్సులు నడిపేందుకు ప్రయత్నం చేయడంలేదు. అధికారులకు ఇష్టం వచ్చినట్టుగా బస్సులు నడుపుతూ కండక్టర్, డ్రైవర్ విధుల సమయాన్నే పరిగణలోకి తీసుకుంటున్నారే తప్ప ఆదాయం, ప్రయాణీకుల సౌలభ్యంపై దృష్టి సారించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రతిరోజు రూట్లలో తిరిగే ఆర్టీసీ సిబ్బంది అభిప్రా యాలు తీసుకున్న మరికొన్ని బస్సులకు ఆదాయం పెరుగుతుంది. జాతీయరహదారి మీదుగా బస్సులు నడిపేందుకు చూపే శ్రద్ధ అధిక మంది ప్రయాణించే రూట్లలో బస్సులు నడపకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రయాణికులు ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించడానికి మక్కువ చూపి గంటల తరబడి వేచి చూసే పరిస్థితి ఉంది. అయినా ఈ సంస్థలో మార్పులేకపోవ డంతో శ్రీకాకుళం నుంచి హైదరాబాదు, శ్రీకాకుళం నుంచి విజయవాడకు బస్సుల సంఖ్య రోజు రోజుకి పెరుగుతుంది. శ్రీకాకుళం నుంచి రణస్థలం మీదుగా మత్స్యలేశం నుంచి పైడి భీమవరం బస్సు నడపాలని ఆ ప్రాంత విద్యార్థులు, మత్స్యకారులు కోరుతున్నా నడిపే పరిస్థితి లేదు. అలాగే పలాస, టెక్కలి ప్రాంతం నుంచి కూడ సముద్ర తీర ప్రాంతాలకు బస్సులు వేయాలన్న డిమాండ్‌కే పరిమితమైంది. ఆయా ప్రాంతాల్లో బస్సులు నడపడం వల్ల పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్నా పట్టించుకోవడంలేదు. కనీసం రూట్ సర్వే కూడ చేసిన దాఖలాలేవని గంగపుత్రులు కోరుతున్నారు.

శ్రీకాకుళం నుంచి పాతపట్నం వరకు తిరిగే బస్సులన్నీ నరసన్న పేట మీదుగానే నడుస్తున్నాయి. హిరమండలం మీదుగా బస్సులు నడిపితే ప్రయాణికులకు లాభం చేకూర్చనున్న ఆ రూట్లపైన ఆ శాఖాధికారులకు దృష్టి లేదు. శ్రీకాకుళం నుంచి పాతపట్నం నిరంతరం వెళ్లే ప్రయాణీకుడు చార్జీలు కాకుండా టోల్ గేటుకు రాకపోకలకు 28 రూపాయలు చెల్లిస్తున్నారు. అదే హిరమండలం మీదుగా పాతపట్నానికి కొన్ని బస్సులు నడిపితే ప్రయాణీకులకు ఒక్కో టోలు గేటు నుంచి ఏడు రూపాయలు చొప్పున మిగులుతుంది. అంతేకాకుండా ఈ రూట్‌లో పది కిలోమీటర్లు మేరకు ప్రయాణం తగ్గుతుంది. అలాగే విశాఖపట్నం వంటి సుదూర ప్రాంతాల నుంచి పాతపట్నం, పుణ్యక్షేత్రమైన శ్రీముఖలింగం ప్రాంతాలకు బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే విశాఖపట్నం నుంచి రాత్రి సర్వీసులన్నీ పాలకొండ మీదు గా కొత్తూరు, బత్తిలి వరకు తిరుగుతున్నాయి. అందులో కొన్ని బస్సులైన శ్రీకాకుళం మీదుగా నడిపితే ఆమదాలవలస, హిరమండలం, ప్రాంతాల నుంచి అనేకమంది ప్రయాణీకులు వెళ్లేందుకు ఇష్టపడతారు. శ్రీకాకుళం నుంచి బత్తిలి వరకు టూ డిపో నుంచి ప్రతి 30 నిమిషాలకు బస్సు వెళుతుంది. ఒక్క ఎక్స్‌ప్రెస్ కూడా నడపరు. వారికి నచ్చినపుడు కనీస ప్రచారం లేకుండా బస్సులు నడపడం సర్వీసు లేదని నిలిపివేయడం ఆనవాయితీగా మారుతుంది. శ్రీకాకుళం నుంచి గుణుపూరునకు నివగాం మీదుగా నడుపుతున్నారు. హడ్డుబంగి నుంచి గుణుపూరు వరకు గల 30 కిలోమీటర్లు దూరంలో మూడు గ్రామాలు కూడా లేవు. అందులో కొన్ని సర్వీసులైన బత్తిలి మీదు గా గుణుపూరుకు నడిపితే ఆంధ్రాఒడిశా సరిహద్దు ప్రయాణికులకు మేలు జరుగుతుంది. ఆర్టీసీకి ఆదాయం పెరుగుతుందని స్పష్టం చేస్తున్నారు.

### విద్యార్థుల కష్టాలు

గ్రామాల నుంచి కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నిత్యం అష్టకష్టాలు పడుతున్నారు. స్టూడెంట్ స్పెషల్ అంటు ఒకటి రెండు రూట్లలో బస్సులు వేసిన విద్యార్థులు మాత్రం ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీకాకుళం వన్, టూ డిపోల నుంచి బస్సులు బయలుదేరే సమయంలో వేలాడుతు విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. కనీసం అక్కడి పరిస్థితులు చూసైన ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయం చేపట్టడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తోంది.

# పలు కుటుంబాలకు నేతల పరామర్శ



**పలాస, ఆగస్టు 4 (వార్త):** వైసీపీ సీనియర్ నాయకులు, వైసిపి రైతు అడ్వైజర్ కమిటీ చైర్మన్ గొర్ల వేణుగోపాల్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని దువ్వాడ శ్రీధర్ ( బాబా) పరామర్శిం చారు. ఆదివారం పలాస మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొర్లే వేణు గోపాల్ మాతృమూర్తి గొర్లె పద్మావతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబానికి దువ్వాడ శ్రీధర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించే వారిలో కూన హేమచలం, టీ శ్రీనివాస్, దువ్వాడ కామేశ్వరరావు చౌదరి, రవీంద్ర, పినకాన తిరుమల రావు, కిల్లి భానుమూర్తి, లకినాన విశ్వ నాథం, బాల, కాళీ మాస్టర్, కంచరాన జగన్, శశి భూషణ్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.



## జుత్తు నీలకంఠం పరామర్శ

**మందస, ఆగస్టు 4 (వార్త):** మందస మండలానికి చెందిన ముగ్గురు ఇటీవల మరణించారు. మృతుల కుటుంబాలను మాజీ ఎంఎల్ఏ స్వర్గీయ జుత్తు జగన్నాయకులు సోదరుడు జుత్తు నీలకంఠం పరామర్శించారు. ఓదార్పు కార్యక్రమంలో భాగంగా మందస మండలం బేతాళపురం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త షావుకారు నరసింహులు భార్య మంజుల మరణించారు. గంగువాడ గ్రామంలో సీనియర్ కార్యకర్త యలమల కృష్ణారావు తల్లి సావిత్రమ్మ, అదే గ్రామంలో కణితి ప్రభావతి మరణించడంతో వారి కుటుంబాలను పరామర్శించి, సంతాపం తెలిపారు. వారి పవిత్ర ఆత్మలకు శాంతి కలగాలని దేవుని ప్రార్థించారు.




## యర్రన్న కుటుంబానికి సాయం

**వజ్రపుకొత్తూరు, ఆగస్టు 4 (వార్త):**గోవాలో ఇటీవల పొట్టకూటి కోసం చేపల వేటకువెల్లి విధి నిర్వహణలో ప్రమాదవు శాత్తు మృతి చెందిన కొమర యర్రన్న (42) కుటుంబ సభ్యుల్ని ఆదివారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు ఈసందర్భంగా మృతుడు భార్య కొమర నూకమ్మ కు బియ్యం ప్యాకెట్ నిత్యావసర సరుకులతో పాటు వెయ్యి రూపాయల నగదును అందజేశారు. చేపల వేట సమయంలో ప్రమాదవు శాత్తు మృతి చెందిన నిరుపేద వర్గానికి చెందిన మత్స్య కారుడు కొమర యర్రన్న కుటుంబానికి ప్రభుత్వం 10 లక్షలు ఎక్సగ్రేసియా చెల్లించి ఆకుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మృతుని భార్య నూకమ్మకు వితంతు పింఛను మంజూరు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి భాస్కరరావుతో పాటు మురిపింటి ధనుంజయం, అవగాన లింగ రాజు, సైని ప్రతాప్ మృతుని కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సర్వే అడ్డగింత

**గార, ఆగస్టు 4 (వార్త):** రామచంద్రపురం పంచాయతీకి చెందిన సుమారు 25 సెంట్లు పేదవారు స్థలంపై దళారులు కన్నేవారు. ఆ ప్రభుత్వ భూమిలో రహస్యంగా భూ సర్వే చేస్తుండగా ఆ గ్రామస్తులు పెద్దలకు సమాచారం ఇవ్వడంతో సర్పంచ్ రమణ, మాజీ సర్పంచ్ అంబటి చక్రధర్ ఆ ప్రదేశానికి వెళ్లి సర్వేను అడ్డుకున్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఈ స్థలంలో శ్రీకృష్ణ మందిరం, గ్రామ ప్రజల దాహార్తిని తీర్చుటకు మంచినీళ్లు ట్యాంకు, ప్రభుత్వ బడిని నిర్మించుకునేందుకు నిర్ణయం తీసుకున్నారు.

## నేడు మందసలో ఎమ్మెల్యే పర్యటన

**మందస, ఆగస్టు 4 (వార్త):** పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ఈ నెల 5న మందస మండలంలో పర్యటించనున్నారని తెలుగు దేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సాబకోట గ్రామ పంచాయతీ బలియాసాయి గ్రామ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. మండల ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

## నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

**పాతపట్నం, ఆగస్టు 4 (వార్త):** నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసు కువచ్చారు. చిన్నస్థాయిలోనే కేంద్రమంత్రిగా ఎంపికైనా రామ్మోహన్ నాయుడును ఎంజీఆర్ అభినందించారు.

**ప్రతిఒక్కరి రుణం తీర్చుకుంటా.**

ఎమ్మెల్యేగా తనను మంచి మెజార్టీ తో గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుం టానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. విశాఖపట్నంలో వాల్తేర్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎంజీఆర్‌ను ఆదివారం సత్కరించారు. సత్కరించి తన బాధ్యతను గుర్తు చేసిన వాల్తేర్‌క్లబ్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మైనర్ రాజు, టీకే రాజు, టీఎస్ఎన్ రాజు, కె.రోహన్, క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు.




జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## ఆదిత్యునికి వెండి సామగ్రి వితరణ

**అరసవల్లి, ఆగస్టు 4 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణస్వామిని ఆదివారం ఉదయం విశాఖపట్నం వాస్తవ్యులు ఎన్. శ్రీమన్నారాయణ కుటుంబీకులు దర్శించుకున్నారు. అనంతరం వెండి ఉద్దరిని, వెండి పంచ పాత్ర, వెండి ప్లేట్ ను ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎస్. చంద్రశేఖర్‌కు అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి వారి జ్ఞాపికను అందజేశారు.







Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413